
# మరణం

నెమలూరి భాస్కరరావు



## ఉదయం పదిగంటలు కావస్తోంది.

నేనింకా బైటకువెళ్లే ప్రయత్నంలోనే నిమగ్నమై ఉన్నాను. నిన్నటి గుడ్డలే వేసుకోవాలా? ఇస్త్రీగుడ్డలు ధరించాలా అన్న సమస్యతో సతమత మౌతున్నాను. రాత్రి భోరున వాన కురిసింది. మావూరి రోడ్లన్నీ పరమ చిరాకుగా బురదతో చితచితలాడ్తుంటాయి.

గత సంవత్సరానికి మా వూరు పుట్టి రెండువందల సంవత్సరాలయిందనీ, ఆ సందర్భంగా ద్విశతాబ్ది ఉత్సవాలు పేరిట మున్సిపాలిటీ వాళ్లు పాతరోడ్లన్నీ తవ్వి కుప్పలు పోశారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలూ, ఉపన్యాసాలూ బ్రహ్మాండంగా జరిపి, రోడ్లు మాత్రం బాగుచేయకుండా అలాగే వదిలేశారు. అందువల్ల రాత్రి కురిసిన వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని, నిన్నటి గుడ్డలే వేసుకోవాలని నిర్ణయించుకుని, ఆ పనిలో ఉండగా, నా శ్రీమతి కాఫీగ్లాస్ తెచ్చి అందించింది. కాఫీ సిప్ చేస్తూ కుర్చీలో కూర్చున్నాను. ఈలోగా ఎదురింటి వాళ్ళమ్మాయి పరుగుపరుగున వచ్చి "ఆంటీ... ఆంటీ... మీకు ఫోన్ వచ్చింది" అని చెప్పి ఎంత వేగంగా వచ్చిందో అంత వేగంగానూ వెళ్లిపోయింది. ఇంక నా శ్రీమతి హడావిడి అంతాఇంతా కాదు. పడుతూ,లేస్తూ, హడావిడిగా ఎదురింటికేసి వెళ్లింది. మా ఇంట్లో ఫోన్ సౌకర్యం లేదు. అందుకని మా బంధువులందరికీ ఎదురింటి వాళ్ల ఫోన్ నంబర్ ఇచ్చాం.

ఎవరో దేవతలు కరుణించినట్లు నా శ్రీమతికి నెలకో సారో,రెండుసార్లో బంధువులు ఎవరోఒకరు ఫోన్ చేస్తూ వుంటారు. ఇంకప్పుడు ఆమె సంతోషం వర్ణనాతీతం. ఫోన్ వచ్చినప్పుడల్లా ఆమె ఎదురింటికి వెళ్లి తిరిగి రావటాన్కి కనీసం అరగంటైనా పట్టేది. వీధిలో అరుగులమీద కూర్చున్న అమ్మలక్కలందరికీ ఫోన్ ఎవరు చేసిందీ, ఏ వూరినించి చేసిందీ వివరంగా, సగర్వంగా చెప్పుకుంటూ వచ్చేది. అలాంటిది ఈసారి ఆమె అయిదు నిమిషాల్లోనే తిరిగి వచ్చేసింది. ఆమె ముఖంనిండా ఆందోళన, విషాదం కమ్ముకుని ఉన్నాయి.

"ఎక్కడ్నించీ ఫోను? అలావున్నావ్ ఏమైంది?" అంటూ సానునయంగా ప్రశ్నించాను. ఆమె ఒక్కసారి బావురుమంది. కళ్లు జలపుష్పాలయ్యాయి. ఏదో విషాదకరమైన విషయం గురించి ఫోన్ వచ్చి వుంటుంది.

"మా అమ్మకు సీరియస్‌గాఉందట. వెంటనే బయలుదేరితే ఆఖరిచూపులైనా దక్కవచ్చు అని మా అన్నయ్య ఫోన్ చేశాడు"

ఆమె నోటివెంట ఈ నాలుగు ముక్కలూ చాలా యిబ్బందికరంగా, రాలేకరాలేక బైటకు వచ్చాయి.

నా శ్రీమతి డిప్రెషన్ పేషెంట్. ఈవార్త ఆమెను ఎంతగా కుంగదీసివుంటుందో నాకు అర్థం అయింది. అందువల్ల ఆమె టెన్షన్ తగ్గించటాన్కి వెంటనే ప్రయాణ సన్నాహాల గురించి చర్చించాను. మరో గంటలో ట్రైన్ వుంది. దానికి బయలుదేరి వెడదామనీ, గుడ్డలూ,గట్రా సర్దుకోమని ఆమెకు చెప్పాను. చెప్పటమేకాదు, సర్దుకుందో లేదో నేనే స్వయంగా పర్యవేక్షించాను. ఎందుకంటే ఆమె టెన్షన్‌లో ఉన్నప్పుడు చాలా విషయాలు మర్చిపోతూ వుంటుంది. అందువల్ల ఆమె టెన్షన్ తగ్గటాన్కి ఆమెను ఓదారుస్తూ, ఆమెకు ధైర్యం చెపుతూ ప్రయాణానికి కావలసిన వన్నీ సకాలంలో ఏర్పాటుచేశాను.

** ** **

టికెట్స్ తీసుకుని ట్రైన్ ఎక్కికూర్చున్నాక ఆమె కొంత

> ఎంతయినా తల్లి తల్లేకదా! ప్రకృతిలో తల్లిప్రేమకు ప్రత్యామ్నాయం లేదుమరి. పేగుబంధం పెనుబంధం. మేం ఎక్కిన రైలు లేటుగా నడుస్తోంది

స్తిమితపడింది. ప్లాట్‌ఫారం క్యాంటిన్‌లో ఓ రెండు బిస్కెట్ ప్యాకెట్స్, కొన్ని డ్రైఫ్రూట్ ప్యాకెట్స్ కొన్నాను. సాయంత్రం ఆరుగంటలకు కానీ మేం ఏలూరు చేరుకోలేం. మా బావమరిది అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం మా అత్తగారు వాడింట్లోనేవుంది.అక్కడే ఆమె జబ్బుపడి సీరియస్ అయింది. మా అత్తగారికి ఎనభై ఏళ్లుంటాయి. పండుముదుసలి.అయినా ఆమె మొన్నటి వరకు చలాకీగా తిరుగుతూనే వుంది. అనేకానేక గాలివానలకు తట్టుకుని సగర్వంగా నిలబడ్డ వటవృక్షంలా, ఆమె జీవితంలో అనేక ఎదురుదెబ్బలూ, దుఃఖపూరిత సంఘటనలూ, ఎదుర్కొని, ఎనభై సంవత్సరాలు వచ్చే వరకు మంచంలో పడకుండా చలాకీగా తిరగటమే నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తూండేది. ఓ పాతిక సంవత్సరాల క్రిందటే ఆమె భర్తను పోగొట్టుకుంది. ఇద్దరు కూతుళ్లలో పెద్దకూతురు చిన్నతనంలోనే భర్తను పోగొట్టుకుని యిద్దరు పసికూనలతో ఇంటికి తిరిగి వచ్చింది. యాభయ్యవపడిలోకి వచ్చిన ఇద్దరు కొడుకులు చనిపోయారు. ఈ దెబ్బలన్నీ తిన్నా ఆవిడ కుంగిపోలేదు. అందుక్కారణం ఆవిడ అలవర్చుకున్న ఫిలాసఫీయే కావచ్చు. ఏడ్చి ప్రయోజనం ఏముంది? అలా జరగాలని మన నుదుట రాసిపెట్టి వున్నప్పుడు. పూర్వజన్మ ఖర్మ ఫలితానికి శిక్ష ఈ జన్మలో అనుభవించటాన్కి బతికే వుండాలి.కుంగిపోతే ఎలా? అది ఈ జన్మలో అనుభవించేస్తే వచ్చే జన్మలో బాకీ మిగలకుండా వుంటుంది. లేకపోతే గత జన్మ బాకీ, ఈ జన్మబాకీ కలిపి తడిసి మొప్పుడుం అయి వచ్చే జన్మలో మరింత దుఃఖభారాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది అనేది ఆవిడ ఫిలాసఫీ. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఒక్కోరకం ఫిలాసఫీ వుంటుంది.ఏ ఫిలాసఫీ లేకుండా శూన్యంలో ఎవరూ వుండరు. వాళ్ల ఫిలాసఫీలకు అనుగుణ్యంగానే వాళ్ల జీవన విధానాలు రూపుదిద్దుకుంటూ వుంటాయి. ఇంతకీ చెప్పొచ్చేది ఏమిటంటే మా అత్తగారు తన ఫిలాసఫీ కారణంగానే అంత పెద్ద వయస్సు వచ్చినా తన ఆరోగ్యాన్ని నిలబెట్టుకోగల్గింది అని. తనతో ముడిపడి జరిగే సంఘటనలన్నింటిలో ఆవిడ తన పాత్రను పెద్దదిగా చేసి, ఆ సంఘటన లన్నింటినీ గాఢంగా తన మనసుకు పులుముకోలేదు. ఆ కారణంగానే ఆవిడ అనేక గాలివానలు ఊపేసినా ఎనభైసంవత్సరాలు వచ్చేవరకు దృఢంగా నిలబడగలిగింది. ఈ వయసులో అనారోగ్యానికి గురికావటం ప్రకృతి సహజంగానే జరిగింది అనుకోవాలి. ప్రతి దానికీ ఓ ప్రారంభం- కొనసాగింపు- ముగింపు ఉంటాయి. బహుశా ఆమె జీవితం ఇప్పుడు మూడవదశలో ఉందనుకోవచ్చు.

ఈ ఆలోచనలన్నీ నేను అనుకున్నవే తప్ప నా శ్రీమతికి చెప్పలేదు. ఆవిడకు ఇప్పుడు ఓదార్పు తప్ప మరేం చెప్పినా ప్రయోజనం లేదు. అందువల్ల నేను దారిపొడుగునా ఆ ప్రయత్నమే చేశాను. నా మాటలకు ఆమె కొంత ఉపశమనం పొందినా అంతకుమించి ఆందోళన పడుతూనే వుంది.ఎంతయినా తల్లి తల్లేకదా! ప్రకృతిలో తల్లిప్రేమకు ప్రత్యామ్నాయం లేదుమరి. పేగుబంధం పెనుబంధం. మేం ఎక్కిన రైలు లేటుగా నడుస్తోంది. ఆ ఆలస్యాన్ని ఆమె భరించలేక రైల్వే శాఖనీ, ప్రభుత్వాన్నీ శాపనార్థాలు పెడుతోంది. అంటే ఆవిడ కమ్యూనిస్టో, కాలమిస్టో కాదు. కన్నతల్లికి ఎలావుందో వెంటనే వెళ్లి చూడాలని ఆత్రుతపడుతున్న ఓ కన్నకూతురు మాత్రమే. చివరకు ఏలూరుస్టేషన్ రానేవచ్చింది. మేం రిక్షాలు మాట్లాడుకుని మా బావమరిది ఇంట్లో పడ్డాం.

** ** **

రిక్షాలు దిగి మేం బావమరిది ఇంట్లోకి వెళ్లేసరికి బంధువులతో ఇల్లంతా కిటకిటలాడుతోంది. ఇంట్లోంచి ఎలాంటి రోదనలూ వినిపించటంలేదు కనక మా అత్తగారు ఇంకా సజీవంగానేఉందని నిర్ధారణచేసుకున్నాను.

"రా అత్తయ్యా... రా పిన్నీ... రా వదినా... అంటూ నా శ్రీమతిని గుమ్మంలోకి వచ్చి ఆహ్వానించారు ఆమె బంధువర్గమంతా. ఆమె జలజలా కన్నీరు కారుస్తూ "మా అమ్మకెలావుంది?" అంటూ చకచకా లోపలకు

నడిచింది. హాల్లో ఓ మంచంమీద మా అత్తగార్ని పడుకోబెట్టారు. ఆవిడ అపస్మారక స్థితిలో వుంది. ఆమె శరీరం చిక్కి శల్యం అయిపోయింది. ఎగశ్వాసలూ- దిగశ్వాసలూ-భారంగా విడుస్తోంది. సెలైన్‌కూడా శరీరంలోకి ఎక్కటంలేదట. కిడ్నీలు ఫెయిల్ అయిపోయాయట. ఆవిడ ఇంక గంటల్లో ప్రాణం విడుస్తుందా అన్నట్లుంది. మీ సంతృప్తికోసం మందులు వాడమంటే వాడతానుగానీ ప్రయోజనం ఏమీ ఉండదు అన్నాడట డాక్టరుగారు. అందుకని నిన్నరాత్రి హాస్పటల్ నుంచి ఆవిడ్ని ఇంటికి తీసుకువచ్చేశారు. బంధువులందరికీ కబుర్లు అందజేశారు. ఈ రిపోర్టంతా అప్పటికే అక్కడకు మాకన్నా ముందు వచ్చిన బంధువులంతా తలో కాస్తా చెప్పగా అర్థం అయింది.

"వెనకటి మనిషికనక ఎనభైఏళ్లు బతికింది. ఇప్పుడు మనమూ ఉన్నాం. నలభై సంవత్సరాలు వచ్చేసరికే అన్నీ అయిపోతున్నాయి" అన్నారెవరో.

"వెనకటి తిండే వేరు. ఆ వాతావరణమే వేరు. అందుకే వెనకటి వాళ్లు అంత దీర్ఘకాలం బతికారు. ఇప్పుడేముంది? అంతా పొల్యూషనూ, హైబ్రీడూ- అందుకే మనమిలా తగులబడ్డాం" అంటూ వాపోయాడొక అకాల వృద్ధాప్యం ఆవరించి వున్న బంధువు.

నా శ్రీమతి సజల నయనాలతో చావు బతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్న తల్లిని చూస్తూ మౌనంగా దుఃఖిస్తోంది. ఆమె దుఃఖాన్ని చూసిన మిగిలిన ఆడవాళ్లంతా ఒక్కసారి ముక్కులు చీదుకోవడం ప్రారంభించారు. ఇల్లంతా కొద్ది నిమిషాలపాటు దుఃఖంతోకూడిన మౌనం రాజ్యమేలింది. ఆ వాతావరణాన్ని బద్దలు కొడుతూ "మొన్న సోమవారం నాటివరకు బాగానే తిరిగింది అన్నయ్యగారు! భోజనంచేసి చక్కగా పక్కింటి పిల్లలతో గవ్వలు కూడా ఆడింది. ఆటమధ్యలో వాళ్లు తొండి ఆడుతున్నారని చిన్నపిల్లలా పోట్లాడింది కూడ. నేనూ, మా ఆయనా ఆవిడ పోట్లాట చూసి నవ్వుకున్నాం. ఆ రాత్రి భోజనం చెయ్యండి అంటే, వద్దమ్మా కడుపులో నెప్పిగావుంది అని తినలేదు. మజ్జిగ మాత్రం తాగి పడుకుంది. ఓ రాత్రివేళ లేచి పెద్దగా ఓ వెర్రికేక వేసింది. అంతే అన్నయ్యగారూ అప్పట్నించీ మనుష్యుల్ని చూస్తోంది కానీ గుర్తుపట్టటం లేదు. మనం పిల్చినా పలకటంలేదు" అంది మా బావమరిది భార్య.

"ఆ అర్థరాత్రి సమయంలోనే వెళ్లి డాక్టర్‌గార్ని తీసుకువచ్చి చూపించాను బావా! డాక్టర్‌గారిల్లు మన పక్క సందులోనే. ఈ ఊరు వచ్చిన దగ్గరనుంచీ ఆయనే మా ఫ్యామిలీ డాక్టర్. చాలా మంచివాడు. పైగా మన కులంవాడే. ఆ రాత్రి ఏవో కొన్ని ఇంజక్షన్స్- మందులూ వాడారు. తెల్లారిన తర్వాత ఆయన నర్సింగ్‌హోమ్‌లో జాయిన్ చేశాం. అన్నిరకాల టెస్టులూ చేశారు. నాలుగు రోజులు హాస్పటల్‌లోనే వుంచాం. చివరికి ఆయన చెప్పింది ఏమంటే; కిడ్నీలు ఫెయిల్‌అయ్యాయనీ, ఆవిడ్ని మందులతో బతికించటాన్కి ప్రయత్నించినా కొన్నిరోజులో- కొన్ని గంటలో తప్ప వయసురీత్యా అదీ సాధ్యం కాకపోవచ్చనీ, అందువల్ల మన ఆర్థిక పరిస్థితినీ- ఆవిడ వయసునీ దృష్టిలో వుంచుకొని ఇక మందులు వాడటం అనవసరం అన్నారు. అందుకని నిన్న రాత్రి హాస్పటల్ నించి డిశ్చార్జి చేయించి ఇంటికి తీసుకువచ్చాం" అంటూ తన భార్య చెప్పగా మిగిలిన విషయమంతా మా బావమరిది చెప్పాడు. ఇంటికి తీసుకువచ్చాక కూడా డాక్టరుగారు రెండుపూటలా వచ్చి రోగిని చూసి వెడుతున్నారు అని మరెవరో చెప్పారు. రావాల్సిన బంధువులంతా వచ్చారో లేదో కనుక్కున్నాను నేను.

** ** **


మా అత్తగారు బహు కుటుంబీకురాలు. ఆవిడకు ఏడుగురు సంతానం. అందులో అయిదుగురు మగపిల్లలూ- ఇద్దరు ఆడపిల్లలు. ఈ పిల్లలకు మరో ముప్ఫయిమంది దాకా సంతానం వున్నారు. మొత్తం అంతా కలిపి ఓ యాభైమంది దాకా పోగయ్యారు ఆవిడ అంతిమ క్షణాల్లో. మునిమనవళ్లనూ, మనవరాళ్లనూ కూడా ఎత్తుకుంది ఆవిడ. శాఖోపశాఖలుగా విస్తరించిన అంత పెద్ద వంశవృక్షానికి ఆవిడ ఆద్యురాలూ- తల్లివేరూ కూడా. వృక్షమే అయినా బోన్‌సాయ్ వృక్షంలా ఆ వంశం మధ్యతరగతి సంకెళ్లను తొలగించుకుని పైకి పెరగలేకపోయింది. అందుక్కారణం, లేదా నెపం ఆవిడ మీదకు నెట్టటాన్కి ఎంతమాత్రం అవకాశంలేదు. అది సబబు కూడా కాదు.

"చాలా రాత్రి అయింది. ఇంక భోజనాలు చేద్దాం బావగారూ! మీరు స్నానాలూ అవీ కానివ్వండి" అన్నాడు మా బావమరిది. స్నానాలూ, కాళ్లు చేతులు కడుక్కోవటాలు అనే పనుల నిమిత్తం అందరూ మా అత్తగారి మంచం దగ్గర నుంచి చెదిరిపోయారు. అరగంట తర్వాత బారులు తీరి అందరూ భోజనాలకు కూర్చున్నాం. అంతా హడావిడి. అందుకే ఎవరో అన్నారు పెద్దవాళ్ల చావు పెళ్లితో సమానం అని. భోజనాలు ముగించేసరికి అర్థరాత్రి అయింది. వంతుల వారీగా కొందరు ముసలమ్మ దగ్గర కూర్చోవటాన్కి, మిగతావాళ్లు పడుకోవటాన్కి సిద్ధం అయ్యాం.

**ముసలావిడ వాళ్ల సహనానికి పరీక్ష పెట్టినట్లు, తనపట్ల వాళ్లకు గల అభిమానాన్ని నిరూపించుకోమని సవాల్ చేసినట్లు, ఇంకో గంటకో అరగంటకో అన్నట్లున్న మనిషి రోజుల తరబడి జీడిలా సాగుతోంది. మింగలేక, కక్కలేక వాళ్లు సతమతమౌతున్నారు.**

** ** **

తెల్లవారు ఝామున అయిదుగంటలకల్లా నేను నిద్రలేచాను. మార్నింగ్ వాక్ పూర్తిచేసుకుని, హోటల్‌లో కాఫీ తాగి పేపర్ కొనుక్కుని ఇంటికి వచ్చాను. నేను పేపర్ చదవటం ముగించేసరికి ఇంటిల్లిపాదీ నిద్రలేచారు. వేడివేడి కాఫీ తెచ్చి ఇచ్చారెవరో. మా వదినగారి కొడుకు నా దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. వాడికి విజయవాడలో ఉద్యోగం.



"అమ్మమ్మ పరిస్థితి యథాతథంగానే వుంది. కోమాలో వుంది. శ్వాస పీల్చుకోటం కూడా కష్టంగావుంది. నిన్నటి దాకా మాటలకపోయినా చూపుంది. తెల్లవారుఝామున నాలుగు గంటలప్పుడు కళ్లు మూతలు పడిపోయాయి. అది నిద్రకాదు. బహుశా కనురెప్పలు పట్లు కోల్పోయి వుండాలి. ఒక్కొక్క అవయవం చచ్చుపడి నిర్జీవం అయిపోతోంది కాబోలు" అంటూ రాత్రి జరిగిన డెవలప్‌మెంట్స్ అన్నీ రిపోర్టుచేశాడు. నేను పేపరు పక్కన పెట్టి ముసలావిడ్ని చూడటాన్కి లోపలకు వెళ్లాను. బల్లిలా మంచానికి కరుచుకుని వుందావిడ. ప్రేతకళ ఆవిడ ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. నా శ్రీమతి తల్లి ముఖాన్ని తడిగుడ్డతో తుడుస్తోంది పుట్టెడు దుఃఖంతో. కాఫీలు తాగిన వాళ్లూ, తాగుతూ వచ్చినవాళ్లూ అందరూ ముసలావిడ చుట్టూచేరారు. ఆవిడ పరిస్థితిని చూసి నిశ్శబ్దంగానూ, ప్రకాశంగానూ ఎవరి అనుభూతిని వాళ్లు ప్రకటించుకుంటున్నారు. నేను వీధి అరుగుమీదకు వచ్చి కూర్చున్నాను. మా బావమరిది నా దగ్గరకు వచ్చి "బావా! డాక్టర్‌గారిని ఒకసారి తీసుకువస్తాను" అని చెప్పి వెళ్లిపోయాడు.

"నేను ముందే చెప్పాను ముసలావిడ అంత త్వరగా పోయే ఘటంకాదని" అన్నాడొక బంధువు.

"మనకు పనులున్నాయికదా అని వెంటనే పోతారా ఏమిటి ఆయుష్షు తీరకుండానే. ఆ సమయం రావాలికదా!" అంది ముసలమ్మకు దూరపు బంధువు అయిన మరో ముసలావిడ. ఆ సంభాషణలు నాకు రుచించలేదు. సిగరెట్స్ కోసం అన్నట్లు లేచి బజారు చివర్న ఉన్న కిళ్లీ బడ్డీ వైపు నడిచాను.

** ** **

మేం వచ్చి రెండు రోజులు అయింది. మాకన్నా ఒక రోజు ముందు వచ్చిన వాళ్లూఉన్నారు. మా అత్తగారు ఇంకా కోమాలో కొన వూపిరితో కొనసాగుతూనే వుంది. బంధువులందరిలో ఒకవిధమైన అలజడి ప్రారంభం అయింది. సీరియస్ అని ఫోన్ రాగానే అందరూ బిలబిలా అని బయలుదేరి వచ్చేశారు. అలా వచ్చినవాళ్లలో కొందరు గవర్నమెంట్ చిరు ఉద్యోగులూ, కొందరు ప్రైవేట్ ఉద్యోగులూ, కొందరు మరేవో పనులు చేసుకునేవాళ్లూ. ఎవరుఏదైనా మొత్తానికి అందరూ రెండుమూడు రోజుల్లో తిరిగి వెళ్లిపోయేందుకు అనుగుణ్యంగా పనులు ప్లాన్ చేసుకుని వచ్చినట్లున్నారు. కానీ వాళ్ల ఆలోచనలకు భిన్నంగా ఇక్కడి పరిస్థితులు దాపురించాయి. ముసలావిడ వాళ్ల సహనానికి పరీక్ష పెట్టినట్లు, తనపట్ల వాళ్లకు గల అభిమానాన్ని నిరూపించుకోమని సవాల్ చేసినట్లు, ఇంకో గంటకో అరగంటకో అన్నట్లున్న మనిషి రోజుల తరబడి జీడిలా సాగుతోంది. మింగలేక, కక్కలేక వాళ్లు సతమతమౌతున్నారు. వెళ్లిపోతే బాగుండదు. వెళ్లకపోతే కుదరదు. ముందు నుయ్యి- వెనక గొయ్యి అన్నట్లుంది పరిస్థితి. ఏంచెయ్యాలి? రెండురోజుల్నించీ ఆంతరంగికుల ముందు చర్చలు జరుపుతున్నవాళ్లల్లా. మూడోరోజుకు బహిరంగంగానే చర్చలు ప్రారంభించారు. ఒకరితో మరొకరు మల్లగుల్లాలు పడ్తున్నారు.

"మా ఆఫీసరు అసలే చండశాసన ముండాకొడుకు. లీవు రెండు రోజులే పెట్టి వచ్చాను. ఇప్పటికే ఒకరోజు అదనంగా అయిపోయింది" అన్నారొకరు.

"శలవు సమస్య నీ ఒక్కడికేనా? అందరిదీ అదే పరిస్థితి. దానికితోడు వెంటనే వెళ్లిపోతాంకదా అని మేం ఇంటిదగ్గర పిల్లల్ని ఒంటరిగా వదిలి వచ్చేశాం. వాళ్లెలా వున్నారో ఏమిటో" అన్నారు మరొకరు.

"నాకేమో ఇంటిచుట్టూ డజన్లకొద్దీ పార్టీలు తిరుగుతున్నారు. ఏంచెయ్యాలో ఏమిటో" అన్నారు మరెవరో.

"సీరియస్ అని ఫోన్ చేస్తే పడుతూ లేస్తూ వచ్చేశాం. అయినా అదేం డాక్టరు. ఆ మాత్రం అంచనా ఉండొద్దూ?" అన్నారింకెవరో.

"ఇంక మందులు అనవసరం. ఆవిడ బతకటం కష్టం. ఇంటికి తీసుకుపోండి అని డాక్టరుగారు చెప్పారు. అలాంటప్పుడు సీరియస్ అని ఫోన్ చేయక ఏంచెయ్యాలి? ఫర్వాలేదులే అని మేం ఊరుకుంటే, చివరి చూపులు కూడా దక్కకుండా చేశారు అని అనిపించుకోవాల్సి

రాదుటండీ?" అంటున్నాడు మా బావమరిది.

"ఆ డాక్టరుగారు ఆర్ఎంపినో, పనికిమాలిన వాడో కాదు. ఊళ్లోకల్లా లీడింగ్ డాక్టర్. ఎం.డి.కూడాను. మరి అలాంటివాడు, బతకదు తెలియజేయాల్సిన వాళ్లకు తెలియజేయండి అన్నాకనే ఫోన్లు చేశాం అందరికీ. డాక్టరు బతకదు అని చెప్పగలడుకానీ, ఏ క్షణంలో చచ్చిపోతుందో లెక్కలు కట్టి చెప్పలేడుకదా!" అంది మా వదినగారు.

"అయినా ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడు ఉండగల్గినవాళ్ళు, విధాయకం అయిన వాళ్లా ఉండాల(్రా! వల్లకాదనుకున్నవాళ్లు వెళ్లిపోవచ్చు. చివరి చూపులు అంటే శవాన్ని చూడటమేకాదు, చావుకి ముందు చూసే చూపు అనికూడా అనుకోవచ్చు అంది బంధువుల్లో మా అత్తగారి ఈడు ముసలావిడెవరో సాగదీస్తూ.

ఆచార వ్యవహారాలకూ- అవసరాలకూ మధ్య ఇలాంటి సందర్భాల్లో సంఘర్షణ తప్పనిసరేమో! ఉండలేని పరిస్థితులకూ- ఉండాల్సిన ఆచారాలకూ మధ్య ఇది వైరుధ్యం. బంధువులందరూ ఇక్కడికి వచ్చి రెండుమూడు రోజులు పైనఅయింది. వెళ్లితీరాల్సిన పరిస్థితి వాళ్లకు మెడమీద కత్తిలా బిగుస్తోంది. మరోపక్కన వెళ్లిపోతే ఎవరేమనుకుంటారో అన్న గిల్టీఫీలింగూ. తడిగుడ్డలా బిగిసిపోతున్న ఆచారాలూ-సాంప్రదాయాలూ వాళ్లను దైన్యస్థితిలోకి నెడ్తున్నాయి. ఇల్లంతా ఇదే చర్చ. మధ్యమధ్యలో ముసలమ్మ ఆరోగ్య పరిస్థితుల మీద అంచనాలూ వినిపిస్తున్నాయి.



"అబ్బే ఆవిడ ఇలాగే రెండు మూడు రోజులున్నా మనం ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు. వెనకటి మనిషాయె మరి. ఇప్పటివాళ్లకు కాస్త జ్వరం తగిలితే చాలు రపీమని పోతున్నారు" అంటూ ముసలావిడ ఇంకా రెండుమూడురోజులు బతకవచ్చు అనే బాంబు పేల్చాడో కాయన. ఇంకేముంది అంతా అలజడి. ఆందోళన. కల్లోలం. మళ్లీ ఎవరి యిబ్బందిని వాళ్లు మరొకరితో వాపోతున్నారు. ఇప్పటిదాకా ముక్కుతో శ్వాసపీల్చుకుంటున్న ముసలావిడ ఇప్పుడు నోటితో శ్వాసపీల్చుకుంటోంది అని వచ్చి చెప్పారెవరో. ఈ వార్త విని వెళ్లిపోవాలని ఆతృతపడ్తున్నవాళ్లు కొంత ఊరట చెందినట్లు అనిపించింది. అందరూ మళ్లీ ఆవిడ మంచం చుట్టూచేరి ఆవిడ జీవితం, అలవాట్లూ, ఆవిడపడ్డ కష్టాలూ, ఆవిడతో తమకుగల అనుబంధం, మొదలైన విషయాలు మాట్లాడటం ప్రారంభించారు. ఆ సాయంత్రానికల్లా అప్పుడప్పుడు చేతులు కదిపే ముసలావిడ ఆ పనికూడా విరమించుకుంది అనే విషయం కొందర్ని విషాదంలో ముంచితే, కొందరు రిలాక్స్ అవటాన్కి తోడ్పడింది. రిలాక్స్ అయినవాళ్లు చెడ్డవాళ్లు మాత్రంకాదు. వాళ్ల పని వత్తిడి- జీవితం కోసం వాళ్లు అలా వుండక తప్పనిసరి పరిస్థితి కల్పించిన సమాజాన్ని అనుకోవాలిగానీ, వాళ్లను నిందించటం సరైంది కాదు అనుకున్నాను.

ఆ మధ్యాహ్నానికి వెంటనే ఆఫీసులకు హాజరు కావాల్సిన కొందరు, పిల్లల్ని వంటరిగా ఇళ్లవద్ద వదిలేసి వచ్చిన వాళ్లూ, చాలా ఇబ్బందికరంగా ఎవరూ అడక్కపోయినా నీళ్లు నములుతున్నట్లు సంజాయిషీలు చెప్పుకుంటూ వెళ్లిపోయారు. వెళ్లిపోయినవాళ్లంతా చెప్పిన మాటల్లోని సారాంశం ఒక్కటే. తప్పనిసరై వెడ్తున్నాంకానీ ముసలమ్మ మీద అభిమానం లేకకాని, ఆవిడ తమ ఆత్మబంధువు కాకపోవటం వల్లకానీ, అలాగే బాధ్యత తెలీక కూడా కాదనీ, ఏమైనా జరిగితే వెంటనే ఫోన్ చేస్తే రెక్కలు కట్టుకుని తిరిగి వచ్చి వాల్తాం అనీ" చెప్పి వెళ్లారు. వాళ్లు గత రెండురోజులుగా ఎంతటి వత్తిడిని అనుభవిస్తున్నారో నాకు తెలుస్తూనే వుంది. అభద్రతాపూరితమైన జీవితం సామాజికంగా ఎదురయ్యే వత్తిడి కారణంగా మానవ సంబంధాలు ఎలా విచ్ఛిన్నం అవుతుంటాయో ఈ సందర్భంగా నాకు అనుభూతమైంది.

"పోనీ లెండర్రా! మొత్తానికి ముసలమ్మను చూడాల్సిన వాళ్లంతా వచ్చిచూశారు. ముఖ్యమైంది అదే. చివరిదాకా ఉండగల్గటం, ఉండలేకపోవటం అన్నది వాళ్లవాళ్ల ఇబ్బందీ, యిష్టాయిష్టాల మీద ఆధారపడిన విషయం. ఇలాంటప్పుడు ఎవర్నీ ఏమీ అనకూడదు" అందొక పెద్దావిడ. వెళ్లిపోగా మిగిలిన వాళ్లు, వెళ్లిపోయినవారి సంకుచిత స్వభావాలగురించి స్వేచ్ఛగా మాట్లాడుకున్నారు కాసేపు. ఈలోగా ఎవరో కొత్త సమస్య ఒకటి ముందుకు తీసుకువచ్చారు. ముసలమ్మ అవయవాలన్నీ చలనం కోల్పోతున్నాయి. కనక వెంటనే ఆవిడ శరీరం మీదున్న ఆభరణాలన్నీ తీసెయ్యాలన్నారు. ఇంతా చేస్తే ఆవిడ చేతులకున్నవి రెండు గాజులు మాత్రమే.

అవి ముందుగానే తీసెయ్యకపోతే బిగిసిపోయి రావన్నారు. పెద్ద చర్చ ఏమీ జరగకుండానే గాజులు తీసేశారు.

కుటుంబ సంబంధాలన్నీ మానవత్వాన్ని, నిజాయితీని కోల్పోయి ఆర్థికసంబంధాలు మాత్రమే మనుషుల్ని కలిపి వుంచుతున్నాయి అనిపించింది నాకు. ఈ విషయమే నా శ్రీమతితో అన్నాను.

"అవును అంతేమరి... అందావిడ. నీకీ వాస్తవం ఇప్పుడు అర్థం అయిందా అమాయకుడా అన్నట్లు.

** ** **

ముసలమ్మ చివరికి మృత్యువుతో హోరాహోరీ పోరాడి తెల్లవారుఝాముకి అలసిపోయి ప్రాణాలు వదిలేసింది. బరువులు, బంధాలు, బంధువులూ- వారసులూ- హితులూ- సన్నిహితులూ ఎవరూ ఆవిడ మరణాన్ని నిరోధించలేకపోయారు. ఆవిడ ఎంతగా మరణయాతనను అనుభవించిందో, ఆవిడను సాగనంపటాన్కి వచ్చినవాళ్లూ మరోరకమైన యాతనను అనుభవించటమే నాకు ఆశ్చర్యకరంగానూ, విచిత్రంగానూ తోచింది. విచ్ఛిన్నమైపోతున్న కుటుంబ వ్యవస్థ, వ్యవస్థీకృతమైన స్వార్థం మానవనైజాన్ని సంకుచితంగా మార్చేస్తున్న తీరు నన్ను కలవరపరిచాయి.

చావు మనుషుల్ని అన్నింటినించీ విముక్తుల్ని చేస్తుంది. చనిపోయినవాళ్ల ఆనవాళ్లు, ఉనికి నశించిపోగా- కొన్నాళ్లు జ్ఞాపకాల్లో మాత్రం మిగులుతారు. క్రమంగా జ్ఞాపకాల్లో కూడా పండగ పబ్బాల్లా వచ్చే స్థితికి చేరుకుంటారు. మా అత్తగారు కొనప్రాణాలతో వుండగానే ఇంట్లోంచి బైటకు తీసుకుపోయారు. ఆత్మీయులు ఏడ్చారు, కొంచెం దూరంవాళ్లు దుఃఖించారు. వెళ్లిపోయినవాళ్లకు, అసలు రానివాళ్లకూ మళ్లీ ఫోన్లు చేశారు. దహన సంస్కారానికి కొందరు వచ్చారు. కొందరు దినవారాలకు వస్తాం అని ఫోన్లు చేశారు.

మా అత్తగారు కొనప్రాణాలతో వుండగానే ఇంట్లోంచి బైటకు తీసుకుపోయారు. ఆత్మీయులు ఏడ్చారు, కొంచెం దూరంవాళ్లు దుఃఖించారు. వెళ్లిపోయిన వాళ్లకు, అసలు రానివాళ్లకూ మళ్లీ ఫోన్లు చేశారు. దహన సంస్కారానికి కొందరు వచ్చారు. కొందరు దినవారాలకు వస్తామని ఫోన్లుచేశారు

ఆవిడ తన మరణదినాల్లో అనుబంధాలూ-బాధ్యతల పేరిట కొనసాగుతున్న ఆర్థికపూరితమైన మానవసంబంధాలను టెలికాస్ట్ చేసినట్లు చూపించిమరీ వెళ్లిపోయింది. నాకు స్మశానంనుంచీ తిరిగివచ్చేటప్పుడు కలిగిన బాధ- ఈ మనిషి మరింక ఎప్పటికీ కనిపించదు కదా అని.

** ** **

దశదిన కర్మకాండలు జరిగేంత వరకు నేను- నా భార్య అక్కడేవుండాలని నిర్ణయించుకున్నాం. పదకొండో రోజు పెద్దఖర్మకోసం ముందురోజే మళ్లీ బంధువులంతా వచ్చేశారు. ఇల్లంతా కిటకిటల్లాడుతోంది. శుభకార్యానికో- అశుభకార్యానికో. బంధువులంతా ఒక్కచోట చేరతారు కనక, గుంపులుగుంపులుగా విడిపోయి అనేక విషయాలు మాట్లాడుసుకుంటున్నారు. ఆ మాటల్లో గొప్పలూ- కోతలూ-అబద్ధాలూ-ఈర్ష్యలూ-ఈతిబాధలూ-అన్ని రకాలూ ఉన్నాయి. మాబావమరిది ఇంటిముందు షామియానాలూ- ఫైబరు కుర్చీలూవేశారు దినంరోజు. భోజనాల కోసం టేబుల్స్ కూడా ఏర్పాటుచేశారు. ఆరోజు కర్మకాండలు ముగిసి భోజనాలుపెట్టేసరికి ఎటుతిరిగీ మధ్యాహ్నం రెండు గంటలవుతుంది. అందుకని అందరికీ ఉదయాన్నే టిఫిన్లు పెట్టి కాఫీలు ఇచ్చారు. కుర్రాళ్లందరూ భోజనాలు లేటవుతాయి కనక మార్నింగ్‌షోలకు ప్రిపేరవుతున్నారు. ఏ సినిమాలు బాగుంటాయా అనే దాని మీద చర్చిస్తున్నారు కొందరు.

మా బావమరిది అద్దెకుంటున్న ఇల్లు చాలా విశాలమైంది. పెరట్లో చెట్లూ చేమలూకూడా ఉన్నాయి. నేనూ, నా శ్రీమతీ నారింజ చెట్టు కింద కుర్చీలు వేసుకుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. ఈ కార్యక్రమాలన్నింటికీ అయ్యే ఖర్చులు ఆవిడ అన్నదమ్ములు ఏవిధంగా వాటాలు వేసుకుంటున్నారో ఆవిడ నాకు చెప్తోంది. ముసలమ్మను హాస్పటల్‌లో చేర్పించింది మొదలు ఈ దినవారాల కార్యక్రమం ముగిసేసరికి కనీసం ఖర్చు నలభైవేలు అవుతుంది అనుకుంటున్నారని చెప్పినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. ముసలమ్మ వైద్యం కోసం అయిన ఖర్చు- ఈ ఆచారాలకోసం అవుతున్న ఖర్చుకన్నా చాలా స్వల్పం. చనిపోయేవాళ్లను బతికించటం కన్నా- సాంప్రదాయాలూ- మెహర్బానీలు బతికించడానికి ఈ మనుషులు పడే తపన, వాళ్ల స్వభావాలూ చూసి నాకు విచారించాలో నవ్వాలో అర్థం కాలేదు.

"ఏమయ్యా! మొగుడూ పెళ్లాలిద్దరే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రహస్యాలయితే రాను మరి" అంటూ వచ్చి ఓ కుర్చీలో కూర్చుంది మా పెద్ద బావమరిది భార్య.

"అబ్బే! అదేంలేదు వదినా! నారింజ చెట్టుకదా! గాలి బాగా వీస్తుందని కూర్చున్నాం అంతే"అంది నా శ్రీమతి. నేనుకూడా ఆహ్వాన సూచకంగా ఓ చిరునవ్వు నవ్వాను. అంతే. ఆ తర్వాత వాళ్లిద్దరూ మాటల్లో పడిపోయారు. నేను మాత్రం శ్రోతలా, మధ్యమధ్య ఆహా- ఊహూ అంటూ, ఒక్కోసారి పళ్లికిలిస్తూ స్లీపింగ్ మెంబర్ అయిపోయాను. ఈవిడగారి భర్త అనగా నా పెద్ద బావమరిది చనిపోయి పదేళ్లు కావస్తోంది. అతను గవర్నమెంట్ ఉద్యోగంచేస్తూ చనిపోయాడు కనక, నెలనెలా రెండువేల వరకు ఈమెకు పెన్షన్ వస్తుంది. పిల్లలందరూ సెటిల్ అయిపోయారు. అందరికీ పెళ్లిళ్లు చేసేసింది.

నా భార్య, ఆవిడ వదినగారూ మా మూడో బావమరిది గురించి చర్చ ప్రారంభించారు. వాడు మిలటరీలో పనిచేసి రిటైర్ అయ్యాడు. దాని తాలూకు పెన్షన్ వస్తుంది. అదీకాక మిలటరీ నుంచి బైటకు రాగానే మరో సివిల్ ఉద్యోగంలో *(మిగతా 39వ పేజీలో)*

# మరణం

(19వ పేజీ తరువాయి)

చేరాడు. మరో నాలుగైదు సంవత్సరాలు చేస్తే ఆ సివిల్ ఉద్యోగంనుంచీ కూడా రిటైర్ అవుతాడు.అప్పుడు వాడికి దాని తాలూకు పెన్షన్ కూడా వస్తుంది. మొత్తం రెండు పెన్షన్లు అవుతాయన్నమాట. తల్లికి సీరియస్‌గా ఉందని తెలియగానే భార్యతో సహా వచ్చాడు. రెండురోజులు ఉండి, శలవులు లేని కారణంగా ముసలమ్మ చనిపోవటాన్కి ముందే వెళ్లిపోయాడు. తిరిగి తల్లి దినం కోసం మొన్న వచ్చాడు. ఈసారి భార్యాసమేతంగా కాక ఒక్కడే వచ్చాడు. అదే నిన్నటినుంచి వేడివేడి చర్చనీయాంశం అయింది. అత్తగారు చనిపోతే కోడలు దినానికి రాకపోవటం మీద బంధువులంతా రకరకాలుగా వ్యాఖ్యానించుకుంటున్నారు. చర్చలు వేడిగానూ, వాడిగానూ, రసవత్తరంగానూ కూడా సాగుతున్నాయి. తన భార్య దినానికి రాకపోవటాన్కి కారణం ఆవిట బైటచేరే రోజులు అని మా మిలటరీ బావమరిది చెప్పాడు. ఆ విషయాన్ని బంధువుల్లో ఎవరూ నమ్మినట్లు లేదు. అందుకే ఆ విషయంమీద చర్చలు కొనసాగుతూనే వున్నాయి.

"అదింకా బైటుండటమేంటి? ఎప్పుడో వుడిగిపోతేను" అన్నారు కొందరు ఆడవాళ్లు.

"అదేంకాదు. మొన్న ముసలమ్మకు సీరియస్‌గా ఉందని తెలియ గానే మొగుడితో కలిసి వచ్చిందికదా! తీరా వచ్చాక ఈ మొగుడు ముండాకొడుకు పీకల్దాకా తాగి బంధువులందర్లోనూ పరువుతీశాడు. ఆపనే ఈసారీ చేసి పరువు గంగలో కలుపుతాడేమోనని భయపడి అది రాలేదనుకుంటాను" అన్నారెవరో.

మిలటరీ బావమరిది తాగుడికి బానిసనే చెప్పుకోవాలి. అతనికి మిలటరీలో ఉండగా అలవాటయింది కాబోలు. మిలటరీ నుంచి రిటైర్ అయినా, తాగుడు నించి మాత్రం రిటైర్ కాలేదు. తాగినప్పుడు భార్యాపిల్లలూ నలుగుర్లోనూ అవమానం పాలవుతారనిగానీ, తనుగూడా నగుబాటుపాలవుతానని అతను ఆలోచించడు. పోనీ కొద్దిగానో, రహస్యంగానో, రాత్రిపూట మాత్రమే తాగే బాపతూ కాదు. రాత్రీపగలూ అనే విచక్షణ వుండదు. ఒంటిమీద స్పృహకోల్పోయేదాకా తాగుతాడు. తాగటానికి తన జీవితంలో ఇదే చివరిరోజు అన్నంత అతిగా తాగుతాడు. పీకల్దాకా తాగి ఆవిధంగా అతను అందరిచేతా ఛీకొట్టించుకుంటాడు. అతని ఈ పాడు అలవాటు కారణంగా భార్యాపిల్లలూ, నలుగుర్లోకీ రావటానికి గిల్టీగా ఫీలవుతుంటారు సహజంగానే. ఎంత తాగుబోతు అయినా పాపం తల్లి ఖర్మకాండలకు వచ్చిన ఈసారి మాత్రం రెండురోజులూ తాగుడు జోలికి పోకుండా నిష్టగానే వ్యవహరించాడు.

"ఇంతకీ మిలటరీ వదిన రాకపోవటానికి కారణం ఏమైవుంటుంది అనుకుంటున్నావ్ నువ్వు మరదలా?" అని నా భార్యను ప్రశ్నించింది ఆవిడ వదినగారు.

"అనుకునేదేముంది వదినా! మా అన్నయ్య చెప్తున్నాడు కదా దానికి నెలసరి రోజులు అనీ" అంది నా శ్రీమతి.

"పిచ్చిదానా ఆ మాటలు నమ్మేశావా?" ఎంత అమాయకులివే అన్నట్లు నా శ్రీమతివైపు చూసింది ఆవిడ వదినగారు. ఈ మాటలకు నిజంగానే పిచ్చిదానిలా వదినగారివైపు చూస్తూ మౌనంగాఉండిపోయింది నా శ్రీమతి. ఆవిడగారేం విశ్లేషణ చెయ్యబోతోందా అని నేను చెవులు నిక్కబొడుచుకుని ఆవిడ చెప్పేదాని కోసం ఎదురుచూడసాగాను.

"అసలు విషయం అదికాదే మరదలా- వాళ్లూ మేమూ ఒకేవూరిలో వుంటున్నాంకదా! మా ఇంట్లో పెళ్లిళ్లూ, పేరంటాలూ, శ్రీమంతాలూ, బారసాలలూ, మ్యారేజ్‌డేలూ, బర్త్‌డేలూ, ఏవో ఓ ఫంక్షన్స్ ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. మీ మిలటరీ అన్నయ్య అన్నింటికీ హాజరవుతూనే వుంటాడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. వచ్చినవాడు రాజసం ఒలకబోస్తూ బంధువులా కూర్చోడు పాపం. చిన్నవీ పెద్దవీ అనే తారతమ్యం లేకుండా అన్ని పనులూ ఇంట్లోని మనిషిలా నెత్తిన వేసుకుని చేస్తాడు. ఆ తాగుడొక్కటి తప్ప మిగతా విషయాల్లో అతను చాలా యోగ్యుడు సుమా! కానీ మీ వదిన మాత్రం చాలా పొగరుబోతు. అహంభావి. అది కొన్ని ఫంక్షన్స్‌కి మాత్రమే మా ఇంటికి వచ్చింది. కానీ మొక్కుబడి కోసమే వచ్చినట్లు వుండేది. కొన్ని ఫంక్షన్స్‌కి అసలు రానేలేదనుకో. దాని గర్వం అంతా ఎందుకనుకుంటున్నావ్? దాని మొగుడికొక్కడికే రెండు పెన్షన్లు వస్తాయని" అంది ఒకే పెన్షన్ అందు కుంటున్న మా పెద్దబావమరిది భార్య.

నేను నివ్వెరపోయాను. రానురాను సమాజంలో మనుషుల విలువలూ- ఆలోచనలూ ఆర్థిక విషయాలకే సంకుచితంగా పరిమితమైపోతున్నందుకు ఆశ్చర్యపోవాలో? బాధపడాలో అర్థంకాలేదు నాకు. ●

## గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు పాటిస్తున్నారా?



వంటగ్యాస్ వాడకంలో జాగ్రత్తలు పాటించపోతే ప్రమాదాలు ఎదురవుతాయి. కనుక మెలకువతో వ్యవహరించండి.

* పొయ్యి ముట్టించి, వంట అయిపోగానే రెగ్యులేటర్‌ను కట్టేయాలి.
* ఇంటికి తాళం వేసే ముందు గ్యాస్ పొయ్యిని పూర్తిగా ఆఫ్ చేశారో లేదో చెక్ చేసుకోవాలి.
* గ్యాస్ లీకవుతున్న విషయాన్ని ఎప్పటికప్పుడు గమనించి తగిన జాగ్రత్తలు పాటించాలి.
* గ్యాస్ పైపును ఏళ్లతరబడి వాడకూడదు. ఆర్నెల్లకోసారయినా మారిస్తే మంచిది.
* రెండు సిలిండర్లు ఉన్నప్పుడు ఒకేచోట పెట్టకూడదు. దూరదూరంగా ఉంచాలి.
* గ్యాస్ సిలిండర్‌పై, పొయ్యిపై నీళ్ళు, ఆయిల్ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
* పదేళ్ళలోపు పిల్లల్ని గ్యాస్ పొయ్యిలవద్దకు అస్సలే రానీయకూడదు. పిల్లల్ని చంకలో ఎత్తుకొని వంట చేయడం ఎంతమాత్రం తగదు.
* అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు జరుగుతాయి. కనుక గ్యాస్ సిలిండర్లను సరిగా మెయింటెయిన్ చేయడం అవసరమని గుర్తుంచుకోండి.

## నవముఖి రుద్రాక్ష

*నవవక్త్రో భైరవస్తు ధారయేత్ వామబాహుకే*
*భుక్తి ముక్తి ప్రథ: ప్రోక్తో మమతుల్య బలో భవేతే!*

*భ్రూణహత్య సహస్రాణి బ్రహ్మహత్య శతానిచ*
*సఘ: ప్రళయమాయాంతి నవ క్త్రస్య ధారణా*

నవముఖి రుద్రాక్షి సాక్షాత్ భైరవ రూపమై ఉన్నది. వ్యాసమహర్షులవారు నవముఖి రుద్రాక్షను నవశక్తి స్వరూప, నవదుర్గల రూపంగా వర్ణించారు. ఈ రుద్రాక్షను ఎడమ భుజంపై ధరించటం వల్ల సకల ఇహ జన్మ, గత జన్మ దోషాలు హరిస్తాయి. ఈ రుద్రాక్ష ధరించినవారు సాక్షాత్తు శివ సమానుడవుతాడని శివ పురాణంలో ఉంది. నవగ్రహ దోషాలు తొలగిస్తుంది. రాహు దశ జరుగుతున్న వారికి రక్షా కవచం వలె పనిచేస్తుంది. తన శక్తి తనకి ఉపయోగపడనివారు, తమ సామర్థ్యానికి తగిన గుర్తింపులేనివారు, తరచూ ఉత్థాన పతనాలు పొందుతున్నవారు జీవితంలో ఎంత కృషిచేసినా పురోగతి లేదని భావించేవారు, దీర్ఘకాల అనారోగ్యంతో ఉన్నవారు, ఆకస్మిక నష్టాలు, ప్రమాదాలు పొందుతున్నవారికి ఈ రుద్రాక్ష సకల శక్తులను ఒసంగి శుభాన్ని చేకూరుస్తుంది. ఛాయా దోషం, కాల సర్ప దోషం ఉన్నవారు విధిగా ధరించవలసిన రుద్రాక్ష ఇది. ఉన్నత పదవులలో ఉన్నవారు, సైన్యంలోఉన్నవారు, అతిపెద్ద వ్యాపార సంస్థల యజమానులు, నిర్వాహకులు, మఠాదిపతులు, గురువులు, దేవీ ఉపాసకులకు ఇది శక్తి ప్రదాతగా, దూరదృష్టిని, దక్షతను, శత్రుబాధా విముక్తిని, కఠిన సమయాల్లో నేర్పుగల నిర్ణయాల్ని తీసుకోవటానికి సమయస్ఫూర్తిని ప్రసాదిస్తుంది. అరుదుగా లభించే ఈ రుద్రాక్ష స్త్రీలు కూడా ధరించవచ్చు. వైద్య శాస్త్రపరంగా ఈ రుద్రాక్షను రోజుకి మూడుసార్లు శుద్ధిపరిచి పాలతో మరిగించి ఆ పాలను సేవించడం వలన క్షయ, దగ్గు, మూల వ్యాధులకు ప్రభావశీలంగా పనిచేయును. ఈ రుద్రాక్షను సోమవారం గాని, శుక్రవారం గాని ధరించవచ్చు.

– డా.ఆమంచి బాలసుధాకర శాస్త్రి

జూన్‌లో ప్రారంభం
అద్భుత వేద, జ్యోతిష వైజ్ఞానిక మాసపత్రిక
**మహర్షి కాలజ్ఞానమ్**
డా॥ ఆమంచి బాల సుధాకరశాస్త్రి సంపాదకత్వంలో ఎన్నో రహస్యములు,
నిత్య జ్యోతిష విజ్ఞానముతో 1 సం॥ చందా=100/-
**శ్రీమహర్షి రుద్రాక్ష & నవరత్న ఎంపోరియం**
నెం.-13, గాయత్రి టవర్స్, గాయత్రి టవర్స్ వద్ద, విజయవాడ-2 ఫోన్: 0866- 570199, 663335
బ్రాంచి: 6-3-354/10, హిందీనగర్, పంజాగుట్ట - హైదరాబాద్, ఫోన్: 040- 6636686, 6636696
ఏజన్సీకై సంప్రదించండి: సెల్: 98490-17959